అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై దాడి

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మూసాపేట, నవంబర్ 27: తన వదిన, సిస్టర్‌పై అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై నలుగురు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ముత్తు విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. చెన్నబోయిన పవన్(22) ప్రైవేట్ జాబ్, చెన్నబోయిన శ్రీధర్(20) ఫుడ్ డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్నారు. వీరిద్దరూ అన్న దమ్ములు. వీరు కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. ఈనెల 22న రాత్రి 11 గంటల సమయంలో తన సిస్టర్, వదినతో కలిసి కూకట్‌పల్లిలోని దుర్గ టిఫిన్ సెంటర్‌లో సమోస తినడానికి వెళ్లారు. అదే సమయంలో కూకట్‌పల్లి శ్రీరామ టవర్స్‌లో నివాసం ఉంటున్న జి.వెంకటరమణ(22) మద్యంమత్తులో తన స్నేహితులతో కలిసి టిఫిన్ సెంటర్ వద్ద ఉన్న యువతులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో పవన్ వెంకటరమణకు మధ్య గొడవ జరిగింది. దీంతో శ్రీధర్ మరో ఇద్దరు స్నేహితులైన బి.సురేశ్(19) జి.అజయ్‌కుమార్(20)లను ఫోన్ చేసి పిలిపించాడు. నలుగురు వెంకటరమణపై దాడి చేసి కర్రతో తలపై కొట్టారు. అయితే వెంకటరమణ వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీంతో వెంకటరమణ బ్రెయిన్ డెడ్‌తో చికిత్స పొందుతూ ఈనెల 23న మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి సీఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పవన్, శ్రీధర్, సురేశ్, అజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైల్లో మహిళ హత్య.. నిందితుడి అరెస్టు

మారేడ్‌పల్లి, నవంబర్ 27: మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైల్లో ఓ మహిళను హత్య చేసిన నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గుర్తించారు. అప్పటికే అతన్ని గుజరాత్‌లోని వల్సాద్ పోలీసులు అరెస్టు చేశారు. పీటీ వారెంట్‌పై వారం, పది రోజుల్లో అదుపులోకి తీసుకోనున్నట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. హర్యానాలోని రోహ్తక్‌లో మోక్రాఖాస్ ప్రాంతానికి చెందిన కరమ్‌వీర్ అలియాస్ రాహుల్ ఇటీవల కాలంలో పలు రైళ్లల్లో ప్రయాణిస్తూ.. ఇప్పటి వరకు కర్ణాటక, యూపీ, మహారాష్ట్ర ప్రాంతాల్లో సుమారు ఆరు గురు మహిళల్ని రేప్ చేసి హత్య చేయడంతో ఆయా రాష్ట్రాల పోలీసులు నిందితుడి కోసం నిఘాను ముమ్మరం చేశారు. అయితే కర్ణాటకలోని బళ్లారి జిల్లా తోర్నగల్ ప్రాంతానికి చెందిన గోవిందప్ప, రమణమ్మ దంపతులు. అయితే వీరి పెద్ద కుమార్తె నగరంలోని జగద్గిరిగుట్టలో నివాసం ఉంటుండగా.. ఆమెను చూసేందుకు రమణమ్మ ఈనెల 23న రాత్రి 7 గంటలకు రైలు ఎక్కింది. ఈనెల 24న ఉదయం రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నది. కానీ ఆ మహిళ బోగిల్లో కనిపించలేదు. పక్కనే ఉన్న దివ్యాంగుల బోగి బాత్‌రూం డోర్ తీసేసరికి రమణమ్మ మృతదేహం కనిపించింది. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. నిందితుడు రోహిత్ హత్య చేసిన వెంటనే పలు రైళ్లో ప్రయాణిస్తూ పారిపోయాడు. గుజరాత్ రాష్ట్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రోహిత్‌ను అప్పటికే నిఘా పెట్టిన వల్సాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు చేసిన నేరాలను అంగీకరించాడు. వల్సాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే మణుగూర్ ప్యాసింజర్ రైల్లో హత్యకు గురైన మహిళను హత్య చేసిన వ్యక్తి రోహిత్ అని వల్సాద్ పోలీసులు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రమణమ్మ వద్ద ఉన్న సెల్ ఫోన్, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మొన్న గృహ ప్రవేశం.. నిన్న అగ్ని ప్రమాదం

మణికొండ, నవంబర్ 27: శుభమా అని.. కార్తిక సోమవారం రోజున గృహ ప్రవేశం ఘనంగా చేసుకున్నారు. అయితే పూజ గదిలో వెలిగించిన అఖండ దీపంతో దుస్తులకు మంటలంటుకొని ఇళ్లంతా కాలిబూడిదైంది. సంతోష్, స్వప్న దంపతులు ఇటీవల పుప్పాలగూడలోని ఈఐపీఎల్ కార్నర్‌స్టోన్ అపార్ట్‌మెంట్‌లోని 8వ అంతస్తులో ఓ ఫ్లాటును కొనుగోలు చేశారు. గత సోమవారం గృహ ప్రవేశాన్ని నిర్వహించారు. నూతన ఇంట్లో వెలిగించిన అఖండ దీపంతో పక్కనే ఉన్న జాకెట్ బట్టకు మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబసభ్యులు ఆదిలోనే ఆర్పివేస్తే ప్రమాదం తప్పేది. కానీ మంటలను చూసి భయపడి వారంతా బయటకు పరుగులు తీయడంతో మంటలు ఇళ్లంతా వ్యాపించింది. ఇంట్లో ఇటీవల చేయించిన ఇంటీరియర్, ఇతర సామగ్రి పూర్తిగా అగ్గిపాలయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.75లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.33 కోట్ల మందులు సీజ్

యాంటీబయోటిక్ తయారీ ఒకరిది.. పేరు మరొకరిది

నిబంధనలకు విరుద్ధంగా మందుల తయారీ

పెద్దఎత్తున రష్యాకు తరలిస్తున్న ఔషధాలు

రష్యాకు తరలిస్తున్న ఔషధాలను సీజ్ చేసిన అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా ఒక కంపెనీలో తయారైన ఔషధాలను మరో కంపెనీ పేరు పేరుతో విదేశాలకు ఎగుమతి చేస్తున్న ఓ ఫార్మా కంపెనీ గుట్టును డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు రట్టు చేశారు. సదరు కంపెనీపై దాడులు జరిపి రూ.1.33 కోట్ల విలువజేసే నాలుగు రకాల యాంటీబయోటిక్ మందులను సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... సిద్ధిపేట జిల్లా, కరకపట్లలోని 'జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రై.లి'కి విదేశాలకు ఔషధాలు ఎగుమతి చేసే లైసెన్స్ ఉంది. దీంతో సదరు కంపెనీ వివిధ రకాల ఔషధాలను రష్యాకు ఎగుమతి చేస్తున్నది. అయితే డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం 1940 ప్రకారం ఔషధాలు తయారు చేసే కంపెనీ మాత్రమే విదేశాలకు ఎగుమతి చేయాలి. అంటే ఔషధాలను ఎగుమతి చేసే అనుమతి ఉన్న కంపెనీలు ఎగుమతి చేయబోయే ఔషధాలను ఆ కంపెనీ మాత్రమే తయారు చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా జోడాస్ ఎక్స్‌పోయిమ్ కంపెనీ పలు రకాల యాంటీబయోటిక్ మందులను స్వయంగా తయారు చేయకుండా నగరంలోని మేడ్చల్-మల్కాజిగిరిలో ఉన్న జీనోమిక్స్ ప్రై.లిలో తయారు చేసిన అంపిసిల్లిన్ ప్లస్ సల్బాక్టమ్ 1000ఎంజి ప్లస్ 500ఎంజి ఇంజిక్షన్‌లను, మహారాష్ట్రలోని జజెన్ ఫార్మ ప్రై.లిలో తయారు చేసిన అమాక్సిలిన్ 1000ఎంజి ప్లస్ క్లావులానికాసిడ్ 200ఎంజి, మెరొపెనమ్ 500ఎంజి ఇంజిక్షన్‌లను జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రై.లి. తయారు చేసినట్లు ఔషధాలపై లేబుల్స్ అంటించి రష్యా దేశానికి ఎగుమతి చేస్తున్నారు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు బుధవారం సిద్ధిపేట, కరకపట్ల లోని బయోటెక్ పార్క్‌లో ఉన్న 'జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రై.లి.'ఫార్మ కంపెనీపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇతర కంపెనీల్లో తయారు చేసిన ఔషధాలను తమ కంపెనీ తయారు చేసినట్లు తప్పుడు లేబుల్స్ ముద్రించి రష్యాకు దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.1.333 కోట్ల విలువజేసే 38,175 వైల్స్ యాంటీబయోటిక్ ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిపిన ఈ దాడుల్లో డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాము, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ సుష్మి, సీహెచ్.కార్తిక్ శివ చైతన్య, టి.శివతేజ, పి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అంబికా రాణికి సన్మానం

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ క్రీడా రంగంలో సాధించిన విజయాలు గర్వకారణమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో జీహెచ్ఎంసీ ఉద్యోగి జాతీయస్థాయి రెజ్లింగ్ క్రీడల్లో బంగారు పతకం సాధించింది. జూడో క్రీడలో ఢిల్లీ నుంచి రజత పతకం సాధించిన అంబికా రాణిని అడిషనల్ కమిషనర్ యాదగిరిరావుతో కలిసి కమిషనర్ శాలువాతో సన్మానించారు. వచ్చే నెల ఆమె పాటియాల(పంజాబ్)లో ఎన్ఐఎస్ఏ శిక్షణా సంస్థలో సర్టిఫికెట్ కోర్సుకు శిక్షణ పొందనున్నారు.

మల్లేశ్‌కు రజతం

హైదరాబాద్,ఆటప్రతినిధి: తమిళనాడు వేదికగా జరిగిన సౌత్ఇండియా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన మల్లేశ్ రజత పతకంతో మెరిశాడు. బుధవారం జరిగిన పురుషుల 105 కిలోల జూనియర్ డివిజన్‌లో హైదరాబాదీ మల్లేశ్ ఆకట్టుకున్నాడు.

'మీ కొడుకు మా కస్టడీలో ఉన్నాడంటూ' కాల్

రూ.1.80లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

బంజారాహిల్స్, నవంబర్ 27: 'మీ కొడుకు మా కస్టడీలో ఉన్నాడంటూ..' సైబర్ నేరగాళ్లు ఫోన్‌కాల్ చేసి బెదిరించి రూ.1.80 లక్షలు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.3లోని లేడీస్ హాస్టల్‌లో ఉంటూ మేకప్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్న పూజా రౌతేలా(35)కు ఈనెల 25న ఉత్తరాఖండ్‌లో నివాసం ఉంటున్న ఆమె అక్క మీనాక్షి చౌదరి(42) ఫోన్ చేసింది. తనకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడని, తన కొడుకు వారి కస్టడీలో ఉన్నాడని చెప్పారని, వారు సూచించిన ఫోన్ నంబర్‌కు డబ్బులు వేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని మీనాక్షి చౌదరి చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన పూజా రౌతేలా తన అకౌంట్ల నుంచి గూగుల్ పే ద్వారా గణేశ్ మీనా(పప్పు కుమార్) అనే వ్యక్తి అకౌంట్‌కు రూ.1,80,000 పంపించింది. డబ్బులు పంపిన కాసేపటికే మీనాక్షి చౌదరి కొడుకు ఇంటికి వచ్చాడు. తనను ఎవరూ తీసుకెళ్లలేదని అతడు చెప్పడంతో ఇదంతా సైబర్ నేరగాళ్ల మోసం అని గుర్తించిన పూజా రౌతేలా మంగళవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బీఎన్ఎస్ 318(2),319(2)తోపాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మనీలాండరింగ్ పేరుతో 31.86 లక్షలు స్వాహా

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): మనీలాండరింగ్ కేసు నమోదైందని డిజిటల్ అరెస్ట్ చేసి ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.31.86లక్షలు దోచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఫెడెక్స్ ఇంటర్నేషనల్ కొరియర్‌లో మీ పేరుతో వెళ్తున్న పార్సిల్‌లో గడువు తీరిన రెండు ఇండియన్ పాస్‌పోర్ట్స్, మూడు హార్డ్ డిస్క్‌లు, 5.5 కిలోల మందులు, 450 గ్రాముల ఎండీఎంఏర్ పట్టుబడిందని, మేము ముంబై పోలీసులని సైబర్ నేరగాళ్లు బాధితుడికి ఫోన్‌చేసి బెదిరించారు. బ్యాంకు ఖాతాలు తనిఖీ చేయాలంటూ స్కైప్ యాప్‌లో వీడియో కాల్ చేసి డిజిటల్ అరెస్ట్ చేశారు. మీ ఖాతాల్లోని డబ్బంతా ఆర్‌బీఐ ఖాతాలోకి పంపించాలంటూ సూచించారు. మీకు సంబంధం లేకుంటే 24గంటల్లో పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌తో మీ డబ్బు మీకు తిరిగి వచ్చేస్తాయంటూ నమ్మించి రూ.31.86లక్షలు దోచేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సైబర్ బాధితులకు రూ.8.44 లక్షలు రీఫండ్

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): రెండు వేర్వేరు కేసుల్లో రూ.8.44లక్షలు సైబర్ బాధితులకు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు రీఫండ్ చేయించారు. యూకేలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి 52 ఏండ్ల మహిళ వద్ద నుంచి సైబర్ నేరగాళ్లు రూ.4,22,560 కాజేయడంతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు జరిపిన ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్ రావు బృందం బాధితురాలి బ్యాంకు ఖాతాకు పోయిన సొమ్ము రూ.4,22,560 వాపస్ చేయించారు. అలాగే 49 ఏండ్ల మహిళకు పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో రూ.7,65,110 మోసం చేశారు. వీటిలో బాధితురాలికి రూ.4,23,667ను రీఫండ్ చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

శామీర్‌పేట, నవంబర్ 27: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురికి గాయాలైన ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన ఫర్హాన్ అహ్మద్ అన్సారీ(20), షాకీర్, రిజ్వాన్, అబ్దుల్లా నలుగురు స్నేహితులు. కారులో హైదరాబాద్ నుంచి కొండపోచమ్మ డ్యామ్ వద్దకు వెళ్తున్నారు. మార్గమధ్యలో మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామశివారులో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఫర్హాన్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవింగ్ చేస్తున్న షాకీర్ కాలు విరిగింది. రిజ్వాన్, అబుద్దల్లాలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో ప్రయాణికుడి మృతి

వెంగళరావునగర్, నవంబర్ 27: అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో ఓ ప్రయాణికుడు మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మంగళవారం రాత్రి 8.30గంటల సమయంలో అమీర్‌పేట మెట్రో రైలు ప్లాట్‌ఫాం నం.1లో రైలు కోసం నిలబడి ఉన్న ఓ వ్యక్తి ఉన్నచోటే కింద పడిపోయాడు. గమనించిన సిబ్బంది ప్రాథమిక చికిత్సనందించి సీపీఆర్ చేశారు. ఫలితం లేకపోవడంతో స్థానిక దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.హార్ట్‌ఎటాక్ వచ్చి ఉండవచ్చని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడు వద్ద లభించిన ఆధారాలను బట్టి ఏపీ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురకు చెందిన మదను జోసఫ్ మరియా బాలశౌరీ సుధీర్(39)గా గుర్తించారు. నగరంలోని కొత్తపేటలో ఉంటూ సింపోర్ సాఫ్ట్‌వేర్ సంస్థలో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్నాడు. జూబ్లీహిల్స్ మెట్రోరైలు ఎక్కి ఎల్‌బీనగర్ మార్గంలో వెళ్లే రైలు కోసం అమీర్‌పేట స్టేషన్‌లో వచ్చి ఉండగా ఉన్నపలంగా పడిపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గంజాయి స్మగ్లింగ్..వ్యక్తి అరెస్ట్

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): ఒడిశా నుంచి గంజాయి తెచ్చి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన సంతోష్‌కుమార్ రౌట్ 2021లో హైదరాబాద్‌కు వచ్చి సెక్యూరిటీ గార్డు, స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేశాడు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఒడిశాలోని పుల్‌భానీ జిల్లాకు చెందిన గంజాయి విక్రేత గోవిందను సంప్రదించాడు. ఒడిశా రైల్లో హైదరాబాద్‌కు గంజాయితో వచ్చి హైదరాబాద్‌లో సంతోష్‌కుమార్‌కు డెలివరీ చేసి వెళ్తుంటాడు. ఇటీవల బంజారాహిల్స్‌లో నివాసముంటున్న సంతోష్‌కుమార్‌కు గంజాయిని సరఫరా చేశాడు. విశ్వసనీయ సమాచారంతో వెస్ట్‌జోన్ పోలీసులు నిందితుడిని పట్టుకొని అతని వద్ద నుంచి 9 కిలోల గంజాయి, వెయింగ్ మిషన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోదాలు చేస్తుండగానే గంజాయి కొనేందుకు వచ్చిన ఏడుగురిని గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

డిజిటల్ అరెస్ట్ నుంచి వృద్ధుడిని కాపాడిన బ్యాంక్ మేనేజర్

రూ.30 లక్షలు నష్టపోకుండా నిలిపివేత

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్ట్‌తో ఓ వృద్ధుడిని బెదిరించి అతని సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్స్ ఖాతాలో ఉన్న రూ.30లక్షలు కాజేయాలనుకున్న సైబర్‌నేరగాళ్ల కుట్రను లోతుకుంట ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ గుర్తించి, బాధితుడిని సైబర్‌నేరగాళ్ల బెదిరింపుల నుంచి కాపాడాడు. లోతుకుంటలో నర్సింగ్‌హోం నిర్వహించే 78 ఏండ్ల వృద్ధుడికి బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేశారు. మేము ఢిల్లీ కస్టమ్స్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని, మలేషియా నుంచి వచ్చిన పార్సిల్‌లో 16 పాస్‌పోర్టులు, ఏటీఎం కార్డులు ఉన్నాయని, వాటి గురించి ఎంక్వయిరీ చేసేందుకు ఫోన్ చేశామంటూ నమ్మించారు. ఫోన్ ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ ఏసీపీ సునీల్‌కుమార్‌కు కలుపుతున్నానంటూ కాల్ ఇతరులకు మళ్లించారు. దీంతో వారు 'మీ ఆధార్ కార్డు, ఇతర వివరాలతో 30 బ్యాంకు ఖాతాలు తెరిచారని, ఆ ఖాతాలతో రూ.88కోట్ల లావాదేవీలు జరిగాయని, ఇదంతా మనీలాండరింగ్ కేసుతో లింక్ అయ్యి ఉందన్నారు'. ఆ తరువాత వీడియో కాల్‌లోకి వచ్చి.. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఇందులో భాగంగా మీ ఖాతాలు కూడా తనిఖీ చేస్తున్నామన్నారు. మీ ఖాతాల్లో ఎంత డబ్బుందంటూ అడిగారు. తన సీనియర్ సిటిజన్ సేవింగ్స్(ఎస్‌సీఎస్ఎస్) స్కీమ్‌లో ఉన్నాయంటూ చెప్పాడు. ఈ విషయం ఎవరికీ చెప్పకు తలుపులు మూసేయి, ఆ ఖాతాను క్లోజ్ చేసి, ఆ డబ్బంతా సేవింగ్ బ్యాంకు ఖాతాలోకి మళ్లించండంటూ బెదిరించారు. లేదంటే వెంటనే మిమ్మల్ని, మీ పిల్లలను కూడా అరెస్ట్ చేయాల్సి వస్తుందని, ఈ విషయం బయటకు చెప్పొద్దంటూ' బెదిరించారు.

చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్

బాధితుడు లోత్‌కుంట ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్‌ను మధ్యాహ్నం 2.30 గంటలకు కలిసి ఎస్‌సీఎస్ఎస్ ఖాతాలో ఉన్న డబ్బు ఎస్బీ ఖాతాలోకి బదిలీ చేయాలని కోరాడు. బాధితుడి ముఖంలో భయం కన్పిస్తోంది, ఎందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నారని బ్యాంకు మేనేజర్ ప్రశ్నించాడు. అప్పటికే ఆయనకు మూడు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఆ ఫోన్ కాల్స్‌తో బాధితుడి ముఖంలో టెన్షన్ కన్పించింది. దాంతోపాటు తన భార్యకు బ్రెయిన్‌కు సంబంధించిన ఆపరేషన్‌కు డబ్బు అవసరముందని జూబ్లీ హిల్స్ అపోలో దవాఖానలో చికిత్స చేయిస్తున్నామని చెప్పాడు. వెంటనే బ్యాంకు మేనేజర్ అపోలోకు ఫోన్ చేసి ఆరా తీయడంతో అలాంటిది ఏమిలేదని తేలింది. దీంతో బ్యాంకు మేనేజర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అప్పటికే బాధితుడు ఆందోళనలో ఉండటంతో బ్యాంకు మేనేజర్ అతనికి ధైర్యం చెప్పాడు. మిమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు. పోలీసులు కూడా మీకు అండగా ఉన్నారు..ధైర్యంగా ఉండంటూ నచ్చజెప్పి బాధితుడు రూ.30 లక్షలు సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కకుండా కాపాడాడు. కోలుకున్న వృద్ధ వైద్యుడు బ్యాంకు మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

రూ.1.51లక్షల విలువైన విదేశీ మద్యం పట్టివేత

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): విదేశీ మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.50లక్షల విలువజేసే 22 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్‌టీఎఫ్ సీఐ నాగరాజు కథనం ప్రకారం.. చెన్నైకి చెందిన ఆది శవరగుణ శేఖరన్, ఫయాజ్ ఖాన్ చెన్నై విమానాశ్రయంలో సెల్‌ఫోన్‌ల దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో తెలిసిన వారి ద్వారా చెన్నై విమానాశ్రయంలో విదేశీ మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి నగరానికి ప్రైవేటు బస్సుల్లో రవాణా చేస్తారు. అనంతరం పరిచయస్తులకు అక్రమంగా విదేశీ మద్యం విక్రయిస్తారు. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ సీఐ నాగరాజు తన బృందంతో కలిసి అమీర్‌పేట మెట్రోస్టేషన్ సమీపంలో ఉన్న గుణశేఖర్, ఫయాజ్‌లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.50లక్షల విలువజేసే 18 జానీ వాకర్, 3 శివాజి రీగల్ విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కాగా, విదేశీ మద్యం బాటిళ్లు పట్టుకున్న ఎస్‌టీఎఫ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

భగీరథమ్మ చెరువులో మట్టి .. సంధ్య కన్‌స్ట్రక్షన్‌పై కేసు నమోదు

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఖాజాగూడలోని భగీరథమ్మ చెరువులో మట్టి పోసిన సంధ్యా కన్‌స్ట్రక్షన్‌పై రాయదుర్గం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈనెల 26న తెల్లవారుజామున 3 గంటలకు టిప్పర్లతో భగీరథమ్మ చెరువులో మట్టి పోస్తున్న దృశ్యాలను హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలు గుర్తించాయి. దీంతో ఇరిగేషన్ శాఖకు హైడ్రా అధికారులు సమాచారం అందించారు. జేసీబీని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. జేసీబీ ఓనర్ సురేశ్‌పై ఇరిగేషన్ అధికారి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసుల విచారణలో జేసీబీ సంధ్యా కన్‌స్ట్రక్షన్‌దిగా గుర్తించారు. దీంతో సంధ్యా కన్‌స్ట్రక్షన్ యజమాని శ్రీధర్ రావుతో పాటు వెంకటేశ్వరరావు, సుంకర వీర వెంకట సత్యనారాయణ మూర్తి, మణికంఠలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కోసమొస్తే ఊపిరాగింది

నిర్మాణ సామగ్రి పడి కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్, నవంబర్ 27: నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద పని చేస్తూ సామగ్రి పడటంతో కార్మికుడు మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా నందిగామ గ్రామానికి చెందిన తమిటినాయుడు(48) పదేళ్ల కిందట నగరానికి వలస వచ్చాడు. దూలపల్లి గ్రామంలో నివాస ముంటూ భవన నిర్మాణంలో గోవాకర్రలు బిగించే కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో దూలపల్లి సమీపంలో సహస్ర కన్‌స్ట్రక్షన్ వద్ద గోవాకర్రలు బిగించే పని చేస్తున్నాడు. ఐదో అంతస్తు నుంచి మరో కార్మికుడు నిర్మాణ సామగ్రిని కిందకు వేయడంతో తవిటినాయుడి తలపై పడ్డాయి. దీంతో తీవ్రంగా గాయపడ్డ బాధితుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాలీబాల్ టోర్నీలో విజేతగా చెన్నై టీమ్

**రంగారెడ్డి వేదికగా జరిగిన సీఎస్ విట్టల్ స్మారక వాలీబాల్ టోర్నీలో చెన్నై టీమ్ విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్లో చెన్నై 25-22, 25-23తో జీఎస్‌టీ ముంబైపై గెలిచింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన భారత మాజీ